
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
శుక్రవారం 10 జనవరి 2025


కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సు

ఊరికి పోదాం

- పశ్చిమలో మొదలైన సంక్రాంతి సందడి
- స్కూళ్లకు సెలవులు.. బస్టాండ్లు కిటకిట
- హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఆర్టీసీ స్పెషల్ బస్సులు

భీమవరం టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి):పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇచ్చేశారు. హాస్టళ్లలోని విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు బయలుదేరారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు స్వగ్రామాలకు వస్తున్నారు. ఈ క్రమంలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. సంకాంత్రి రద్దీ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రత్యేక బస్సు సర్వీసులు బుధవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. రోజూ జిల్లాకు వచ్చే 14 సర్వీసులకు అదనంగా 123 బస్సులను నడుపుతున్నారు. 8వ తేదీ ఉదయం జిల్లా నుంచి నాలుగు బస్సులు హైదరాబాద్ వెళ్లాయి. రాత్రి అక్కడ ప్రయాణికులను ఎక్కించుకుని గురువారం ఉదయం డిపోలకు చేరాయి. నరసాపురం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి ఒక్కొక్క బస్సు చొప్పున పంపించారు. 9న 21, 10న 32, 11న 32, 12న 30, 13న నాలుగు బస్సులు అక్కడి నుంచి జిల్లాకు వస్తాయి. అన్ని బస్సులకు రిజర్వేషన్‌లు నిండుకున్నాయి. ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులకు లేకుండా తణుకు డిపో మేనేజర్ గిరిధరకుమార్ పర్యవేక్షణలో వివిధ డిపోల నుంచి ఐదుగురు సిబ్బంది, ఆరు సిట్టింగ్ స్క్వాడ్‌ల సిబ్బందిని టీమ్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో రిజర్వేషన్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా టీమ్ పనిచేస్తుంది. వీరు 13 వరకు అక్కడే ఉంటారు.

బీఎల్‌వోలకు గౌరవ వేతనం


భీమవరం టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న 650 మంది బీఎల్‌వోలకు 2021 నుంచి రావాల్సిన గౌరవ వేతనం కోటీ 85 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మల జకరయ్య, కోశాధికారి చిట్టిబాబు తదితరులు కలెక్టర్ నాగరాణికి కృతజ్ఞతలు తెలిపారు. జనరల్ ఎలక్షన్ ఫండ్ నుంచి కలెక్టర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో ఫస్ట్ రావాలి : కలెక్టర్

భీమవరం రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది మార్చి 15 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి, రాష్ట్రంలోనే మన జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా సమష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగరాణి పేర్కొన్నారు. గురువారం భీమవరంలో జరిగిన భీమవరం డివిజన్ స్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో టెన్త్ ఫలితాలపై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 'ఎస్‌ఏ-1 పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని అనుసరించి పక్కా ప్రణాళికను అమలు చేయాలి. ప్రత్యేక తరగతులు సమర్థవంతంగా నిర్వహించాలి. సి, డి గ్రేడ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అవసరమైతే మరో అరగంట ఎక్కువగా ప్రత్యేక క్లాసులో ఉంచాలి. ఆడపిల్లల రక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలి. విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని తగ్గించడానికి ఆత్మ విశ్వాసాన్ని పెంచాలి' అని కలెక్టర్ తెలిపారు. డీఈవో ఇ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన శ్రీవారి క్షేత్రం

- ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి సర్వం సిద్ధం
- ఉదయం 4-30 నుంచి.. భక్తులకు అనుమతి
- తిరుపతి ఘటన నేపథ్యంలో అధికారుల అప్రమత్తం..
- భారీ భద్రతా ఏర్పాట్లు.. పరిశీలించిన ఎస్పీ కిశోర్


విద్యుత్ కాంతులతో ఆలయ గోపురాలు..
ఏర్పాట్లపై ఎస్పీ కిశోర్ అధికారులతో సమీక్ష

ద్వారకాతిరుమల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ద్వారకాధీశుని దివ్యక్షేత్రంలో శుక్రవారం జరగనున్న ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెల్లవారుజాము 4.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉత్తరద్వారం వద్ద దర్శనాలకు అనుమతిస్తామని ఈవో త్రినాథరావు తెలిపారు. ఉత్తర ద్వారాన్ని, స్వామి ఆశీనులయ్యే గరుడ వాహనాన్ని, పరిసరాలను పూలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. తొలుత వెండి గరుడ వాహనంపై ఉభయ దేవేరులతో కొలువై దర్శనమిచ్చిన శ్రీవారు తర్వాత వెండి శేష వాహనంపై దర్శనమిస్తారు. ముక్కోటి నాడు స్వామిని దర్శించాలని దూరప్రాంతాల దీక్షాధారులు గురువారం రాత్రికే ఆలయానికి చేరుకున్నారు. దర్శనానంతరం ఇరుముడులు సమర్పిస్తారు.

అధికారుల అప్రమత్తం

వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ నేపథ్యంలో తిరుమలలో చోటు చేసుకున్న పెనువిషాదాన్ని దృష్టిలో ఉంచుకుని ద్వారకాతిరుమలలో అధికారులు అప్రమత్తమయ్యారు. చిన వెంకన్న ఉత్తరద్వార దర్శనం సమయంలో ఏ అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లుచేశారు. ఆలయ సెక్యూరిటీని అప్రమత్తం చేయడంతోపాటు, పోలీస్ మిగతా 6వ పేజీలో..



సప్తగిరివాసుడి గిరి ప్రదక్షిణ

శ్రీనివాసా గోవిందా.. వేంకటేశా గోవిందా.. ఆపద్బాంధవ గోవిందా.. అనాథ రక్షక గోవిందా అంటూ భక్తి పారవశ్యంతో శ్రీవారి భక్తులు పులకించారు. గురువారం చినవెంకన్న గిరి ప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 4లో..

కిక్.. దిగిపోయింది

జానీవాకర్ మద్యానికి బ్రాండ్ ఇమేజ్ ఉంది. దీని విలువ ఎనిమిది వేల వరకు ఉంటుంది. కాని భీమవరంలో మూడు వేలకే అమ్ముతున్నారు. నేరుగా తమిళనాడు నుంచి తెప్పిస్తున్నామని, అక్కడ ఇంతకంటే తక్కువకు వస్తుందని చెప్పి విక్రయిస్తున్నారు. ఎలాగూ సంక్రాంతి కావడంతో భీమవరంలో మద్యపాన ప్రియులు పెద్ద సంఖ్యలో ఈ బాటిల్స్‌కు ఆర్డర్ ఇచ్చి తెప్పించారు. విషయం ఈ నోట.. ఆనోటా ఎక్సైజ్ అధికారుల చెవిలో పడింది. అంత ఖరీదైన మద్యం మూడు వేలకు ఎలా ఇస్తున్నారా ? అని ఆరా తీశారు. నిఘా వేస్తే.. జానీవాకర్ పేరిట నకిలీ మద్యాన్ని విక్రయిస్తున్నట్టు గుర్తించారు. పలువురిని అరెస్ట్ చేసి నిజాలు రాబట్టారు. లభ్యమైన బాటిళ్ల శ్యాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపారు. ఈ విషయం తెలియడంతో 'ఇన్నాళ్లు మనం తాగింది నకిలీ మద్యమా..' అంటూ ఇది సేవించిన వారు అవాక్కవుతున్నారు.





జానీవాకర్ పేరిట ఎనిమిది వేల మద్యం బాటిల్ మూడు వేలకే..

- భీమవరంలో మూడేళ్లుగా అమ్మకాలు..
- తమిళనాడు నుంచి దిగుమతి..
- సంక్రాంతి వేళ భారీగా ఆర్డర్లు
- నిఘా పెట్టిన ఎక్సైజ్.. ఇద్దరి అరెస్ట్..
- అది నకిలీ సరుకని తేల్చిన అధికారులు
- హానికర రసాయనాలు ఉన్నట్టు అనుమానం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



భీమవరం కేంద్రంగా సాగుతున్న అక్రమ మద్యం అమ్మకాల గుట్టురట్టయ్యింది. తమిళనాడు నుంచి రహస్యంగా తెచ్చి.. తక్కువ ధరకు బ్రాండెడ్ రకాల పేరిట అమ్ముతున్న మద్యం నకిలీదని తేలింది. ఈ నిర్వాకానికి గత వైసీపీ ప్రభుత్వ మద్యం పాలసీనే కారణమని భావిస్తున్నారు. జానీవాకర్ మద్యం అంటే మద్యపాన ప్రియులకు ఓ పులకింత. ఈ ప్రాంతంలో బ్రాండెడ్ రకాలపైనే మోజు ఎక్కువ. వైసీపీ హయాంలో బ్రాండెడ్ రకాలు లేకపోవడం, నాసి రకం మద్యాన్నే విక్రయించడంతో దీనిని మాఫియా సొమ్ము చేసుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుని భీమవరం కేంద్రంగా విక్రయాలు సాగించింది. ఏలూరు, నెల్లూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోనూ దీనిని విస్తరించారు. ఈ క్రమంలో మూడేళ్లుగా మద్యం అమ్మకాల్లో టర్నోవర్ చేరుకోవడం కష్టమయ్యేది. ఇతర రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు పెరుగుతూ ఉంటే పశ్చిమలో లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. ఆక్వా రంగం, వరి సాగు దెబ్బతినడంతో అమ్మకాలు తగ్గాయంటూ ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తూ వచ్చారు. ఉన్నతాధికారుల సమీక్షలోనూ ఇదే విషయాన్ని చెప్పేవారు. అయినా రాష్ట్ర స్థాయిలో నమ్మశక్యం అయ్యేది కాదు. అయినా సరే ఏమీ చేయలేని పరిస్థితి. న్యూ ఇయర్, సంక్రాంతి వచ్చిందంటే పాలకొల్లు ప్రాంతంలో చండీఘడ్ నుంచి మద్యం దిగుమతి చేసి విక్రయించిన సందర్భాలు ఉన్నాయి. అప్పటి వైసీపీ నేతల అండదండలతో జోరుగా పన్ను లేని మద్యం అమ్మకాలు సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాఫియా అక్రమ రవాణా ఆగలేదు. ప్రస్తుతం మద్యం షాపుల్లో నాణ్యమైన బ్రాండ్‌లు లభ్యమవుతున్నాయి. అయినా సరే మాఫియా తక్కువ ధరకే బ్రాండెడ్ మద్యం అందిస్తామని భారీగా ఆర్డర్లు తీసుకుంటున్నది. దీనిపై ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా పెట్టారు. గురువారం విజయవాడ నుంచి వస్తున్న ఓ కారులో 26 బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్య డీలర్ భీమవరానికి చెందిన కొమ్మిశెట్టి వెంకటేశ్వరులుగా గుర్తించారు. మద్యాన్ని తరలించిన డ్రైవర్‌తో పాటు, కారును సీజ్ చేశారు. కె.కాశేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు మిగతా 6వ పేజీలో..


సోది చెబుతామండి.. సోది !

చిన్నారుల సంక్రాంతి సందడి

సంక్రాంతి వేడుకల్లో భాగంగా భీమవరం విష్ణు స్కూల్‌లో చిన్నారులు వివిధ కళాకారుల వేషధారణలు ధరించి అలరించారు.


జంగమదేవర

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఊరట

మేలు చేసిన కూటమి ప్రభుత్వం

- ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్యసేవల పునరుద్ధరణ

భీమవరం టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 2020 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్య సేవలు పొందేందుకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీని ద్వారా జిల్లాలో 150 మందికిపైగా రిటైర్డ్ ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుంది. 2020లో ఆర్టీసీని అప్పటి జగన్ సర్కార్ ప్రభుత్వంలో విలీనం చేసింది. కార్పొరేషన్‌లోని వారంతా ప్రభుత్వ ఉద్యోగులుగా మారడంతో తమకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆశపడ్డారు. కాని, 2020 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇకపై ఈహెచ్‌ఎస్ ఉండదని చెప్పడంతో నిరాశ చెందారు. వారంతా సొంత ఖర్చులతోనే వైద్య సేవలు పొందాల్సిన పరిస్థితి. అసలే పెన్షన్ తక్కువ. పైగా వైద్య సదుపాయం రద్దుతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా కార్పొరేషన్‌లో ఉన్నప్పుడు పదవీ విరమణ సమయంలో ఉద్యోగి నుంచి కొంత సొమ్మును ఈహెచ్‌ఎస్‌కు కట్టించుకుని భార్యాభర్తలకు రెండు లక్షల 50 వేల వరకు వైద్య ఖర్చులు భరించి సేవలందించేవారు. విలీనం తర్వాత దానిని రద్దు చేయడంతో అయోమయంగా మారింది. అంతకు ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికి ఈ సేవలు యథావిధిగా అందుతున్నాయి. ఈ సమస్యలపై యూనియన్ నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో సానుకూలంగా స్పందించారు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

రిటైర్డ్ ఉద్యోగుల విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం వారికి ఊరటనిచ్చే విషయమని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్ఎస్ రావు తెలిపారు. ఐదేళ్లుగా వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చులు చేసుకునే పరిస్థితిలో ఈహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


రిటైర్డ్ ఉద్యోగులు

పండగ హడావుడి

సంక్రాంతి పండగ హడావుడి మొదలైపోయింది.. స్కూళ్లకు సెలవులు ప్రకటించడంతో అంతా ఊర్లకు బయలుదేరారు..హాస్టల్లో ఉండే తమ పిల్లలను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకు వెళుతున్నారు.. ఇక స్కూళ్లలో సంక్రాంతి సందడికి తెరలేపారు.. భోగిమంటలు, గొబ్బెమ్మలు, బొమ్మలకొలువులు ఏర్పాటు చేసి ముందే పండుగ చేస్తున్నారు.. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో అదరగొట్టారు..



గొబ్బిళ్లోయ్..గొబ్బిళ్లు : పెనుగొండ భాష్యం స్కూల్లో గొబ్బెమ్మలు పెడుతున్న చిన్నారులు..



భోగి మంటల్లో ఆవు పిడకల దండలు వేస్తున్న విద్యార్థులు







ఏలూరులో ఇళ్లకు వెళ్లే ఉత్సాహంలో..







భీమవరం విష్ణు స్కూల్లో గోదా కల్యాణం.. బొమ్మల కొలువు ప్రదర్శన



రాష్ట్రపతి కార్యాలయం నుంచి వచ్చిన ఆహ్వాన పత్రిక అందుకుంటున్న సుబ్బారావు

రైతుల కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటాను..

ఆంధ్రజ్యోతితో ఆచంట రైతు సుబ్బారావు

గణతంత్ర వేడుకలకు రాష్ట్రపతి నుంచి ఆహ్వానం

ఆయన చదివింది ఎస్ఎస్ఎల్సీ.. కానీ చూసేవారికి ఆయన ఒక వ్యవసాయ శాస్త్రవేత్తగా కనిపిస్తారు.సాగులో ప్రయోగాలు చేశారు.. కొత్త వంగడాలను సృష్టించారు.. 89 సంవత్సరాల వయసులో కూడా వ్యవసాయాన్ని నమ్ముకుని అనేక మంది రైతులకు అనేక సేవలందిస్తున్నారు..వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడుతున్న ఆయన కృషిని గుర్తించి అభినందిస్తూ ఈనెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు రావాలంటూ రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఆహ్వానం పంపారు..ఆయనే ఆచంటకు చెందిన కృషి పండిట్ నెక్కంటి సుబ్బారావు... ఈ సందర్భంగా ఆయనను ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు ముచ్చటించారు... - ఆచంట (ఆంధ్రజ్యోతి)

• చిన్న వయసు నుంచే వ్యవసాయం

1960లో మా తండ్రి వీరాస్వామి కాలం చేశారు.. అపుడు నేను ఎస్ఎస్ఎల్సీ చదువుతున్నాను.. ఆ వయసులోనే కుటుంబ బాధ్యతలు నా మీద పడ్డాయి. అపుడు నా వయస్సు 20 సంవత్సరాలు ... మేము మొత్తం ఆరుగురు అన్నదమ్ములం. మా పెద్ద అన్నయ్య నాగేశ్వరరావు వ్యవసాయం చేసేవారు. అతని వద్ద నేను వ్యవసాయం నేర్చుకున్నాను. అప్పటి నుంచి వ్యవసాయం పైనే మక్కువ చూపాను.

• ఆచంట నుంచి కొత్త వరి వంగడం..

దేశంలో ఆహార కొరత ఎక్కువగా ఉన్న కాలం అది. ఆ సమయంలో 1967లో అప్పటి కేంద్ర ఆహార శాఖా మంత్రి సుబ్రహ్మణ్యం ఫిలిప్పీన్స్ నుంచి ఐర్-8 అనే వరి వంగడాన్ని రప్పించి కోయంబత్తూర్, మార్టేరు వరి పరిశోధనా కేంద్రాలకు పరిశోధన నిమిత్తం పంపించారు.. మొదట్లో సాగు చేసినా పెద్దగా దిగుబడి రాలేదు.. విజయవాడలో ఈ రకం అభివృద్ధికి శాస్త్రవేత్తలు సమావేశం నిర్వహించగా వెళ్లాను.. ప్రత్యేకంగా ఆ వరి రకం తీసుకువచ్చి అభివృద్ధి చేసి రెండు వేల ఎకరాల్లో సాగు చేపట్టాం. ఏకంగా 40 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ సీడ్‌ను దేశంలోని అనేక రాష్ట్రాలకు పంపడంతో రైతులు మంచి దిగుబడులు సాధించారు.

• దిగుబడుల సాధనకు కృషి చేస్తూనే ఉంటా..

ఆచంట పక్కనే మార్టేరులో వరి పరిశోధన స్థానం ఉండటంతో తరచూ అక్కడకు వెళ్లేవాడిని. అక్కడున్న శాస్త్రవేత్తలతో మాట్లాడేవాడిని.. సాగులో మెలకువలను తెలుసుకునేవాడిని.. కొత్త వండగాల అభివృద్ధికి వారి సూచనలు, సలహాల మేరకు వరిసాగు చేసేవాడిని.. అధిక దిగుబడులు సాధించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటాను. వ్యవసాయంలో నేను చేస్తున్న కృషికి ఇప్పటివరకు 16 నేషనల్, మూడు ఇంటర్నేషనల్ అవార్డులతో పాటు 29 అవార్డులు వచ్చాయి. 2013లో గుజరాత్‌లో నరేంద్రమోదీ చేతుల మీదుగా సన్మానం చేసి షీల్డ్ అందించారు.ఫిలిప్పీన్స్‌లో ఆర్ఐ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా అవార్డు పొందాను.

• రైతుల్లో అవగాహనకు కృషి

ప్రస్తుతం సొంత వ్యవసాయం 12 ఎకరాల్లో పాటు మరో 20 ఎకరాలకు సంబంధించి కౌలు వ్యవసాయం కూడా చేస్తున్నాను. అత్యంత సన్న రకం ఆర్‌జీఎల్ 7034, 7039 వరి వంగడాలు దాళ్వా సాగులో చేస్తున్నాను. వ్యవసాయంలో నేను చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్రపతి ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు ఆహ్వానం పంపడం చాలా ఆనందంగా ఉంది.. ప్రస్తుతం నూటికి 80 శాతం కౌలు రైతులు 20 శాతం రైతులు వ్యవసాయం చేస్తున్నారు. కౌలు రైతులు సరైన అవగాహన లేకపోవడంతో ఎరువులు షాపుల్లో ఇచ్చే ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడుతున్నారు. ఎక్కువ ఎరువుల వినియోగం వల్ల దిగుబడి కూడా తగ్గుతుంది. వ్యవసాయం ఎలా చేయాలి ? ఎరువులు ఎలా వాడాలనే దానిపై కరపత్రాలు ముద్రించి రైతులకు అందిస్తున్నాను.





నరేంద్రమోదీ నుంచి షీల్డ్ అందుకుంటున్న సుబ్బారావు... ఫిలిపైన్స్‌లో ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా 2013లో అవార్డు అందుకుంటూ..

శ్రీనివాసా..గోవిందా !

ద్వారకాతిరుమలలో వైభవంగా గిరిప్రదక్షిణ

ద్వారకాతిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో గురువారం జరిగిన గిరిప్రదక్షిణతో శేషాచల పరిసరాలు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి. శ్రీనివాసా గోవిందా...శ్రీ వేంకటేశా గోవిందా...ఆపద్బాంధవ గోవిందా.. అంటూ భక్తులు ఆలయ తొలిమెట్టు వద్ద ముందుగా భజనలు చేశారు. అలంకరించిన ధర్మప్రచార రథంలో కొలువైన శ్రీవారి దివ్యమూర్తులకు ఆలయ ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఈవో వేంద్ర త్రినాథరావు దంపతులు రథం ముందు బలిహరణ సమర్పించి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, కోలాట ప్రదర్శ నలు, కేరళ వాయిద్యాలు, తీన్‌మార్‌ల నడుమ గజ, వృషభ, అశ్వాలు ప్రచారరథం ముందు నడుస్తుండగా అశేష జనవాహినితో జరిగిన ఈ గిరిప్రదక్షిణతో రహదారులు కిక్కిరిశాయి. ఆలయం వద్ద ధనుర్మాస మండపం వద్ద ప్రారంభమై కొత్త బస్టాండ్, దొరసానిపాడు, రాళ్లకుంట, శేషాచల ఘాట్ రోడ్డు, ఉగాది మండపం మీదుగా 6కి.మీ మేర అంగరంగ వైభవంగా తిరిగి ఆలయానికి చేరుకుంది. మార్గమధ్యలో భక్తులకు దాతల సహకారంతో పండ్లు, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు..

యాత్రలో సందడి చేసిన బాలల కోలాట ప్రదర్శన, వేషధారణలు, కేరళవాయిద్యాలు..



గిరిప్రదక్షిణలో గజలక్ష్మి







జన్మనిచ్చిన తల్లిని... పుట్టిన ఊరును మరవరాదని చెబుతుంటారు.. విదేశాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి తమ సొంతూరుకు ఎంతో కొంత సేవ చేయాలనే ఆలోచన చేయడం అభినందనీయమే..బాగా సంపాదించి తమ ముందు తరాలకు కోట్లు కూడ బెట్టాలనే ఆశ ఉన్నవారూ ఉంటారు... కానీ సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి ఉపయోగపడే విధంగా ఖర్చు చేస్తున్నవారిని అభినందించాల్సిందే..

సొంత ఊరికి కొంత మేలు..

జన్మభూమి సేవలో ప్రవాసాంధ్రులు



పొన్నపల్లిలో పేదలకు కట్టించిన ఇల్లు

యువతకు ఉపాధి కల్పిస్తున్న కొవ్వలి నాయుడు



నరసాపురానికి చెందిన కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు అమెరికాలో స్థిరపడ్డారు.తాను పడిన కష్టాలు నిరుద్యోగులకు ఉండకూడదన్న ఉద్దేశంతో ఎంతో మందిని సొంత ఖర్చులతో అమెరికా తీసుకు వెళ్లి చదివించి, అక్కడ వారికి తన కంపెనీలో ఉపాధి కల్పిస్తున్నారు. ఇలా నరసాపురం నుంచి 100 మందిపైనే ఉంటారు. ఇక నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ఆర్థికంగా స్తోమత లేని 20 మంది డిగ్రీ, ఇంటర్ విద్యార్థులను ఆయన చదివిస్తున్నారు. ప్రతి నెల 20 కుటుంబాలకు పైనే మందులు, నిత్యవసరాలు పంపిణీ చేస్తున్నారు. ప్రమాదాల్లో కాలు కోల్పోయిన వారి కోసం ప్రత్యేకంగా క్యాంపు పెట్టి ఉభయగోదావరి జిల్లాల్లో సుమారు 100 మందికి కృత్రిమ కాళ్లు అందించారు. నియోజకవర్గంలో సుమారు 30కుపైగా అలయాలకు విరాళాలు ఇచ్చి ఆధునీకరించారు. పట్టణంలో కాపు కళ్యాణ మండపాన్ని రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేశారు. వందేళ్ల నాటి కుమ్మరవీధి రామాలయాన్ని రూ.కోటితో పునర్ నిర్మించారు. 2022 తుఫాన్ సమయంలో నీటి మునిగిన పొన్నపల్లి, కొత్త, పాత నవరసపురం గ్రామాల్లో సుమారు రూ.15 లక్షలు వెచ్చించి నిత్యావసరాలందించారు. అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన బాధితులకు ఇళ్లు కట్టించి ఇచ్చారు. తాను పుట్టిన ఊరు కోసం ఇలా తనవంతు సాయం చేస్తూనే ఉన్నారు. స్థానికంగా ఎంతోమంది ఇంజనీరింగ్ విద్యార్థులకు వర్క్‌ఫ్రం హోం కింద తన కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. కొవ్వలి ఫౌండేషన్ పేరుతో ఆయన చేస్తున్న సేవల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రశంసించారు.చేస్తున్న పనుల గురించి ఎవరైనా పొగిడితే...ఊరు నాకు గుర్తింపునిచ్చింది... ఇంకా చేయాల్సింది చాలా ఉందని చెబుతుంటారు.

- నరసాపురం (ఆంధ్రజ్యోతి)

దాహార్తి తీరుస్తున్న వేగేశ్న ఫౌండేషన్



గణపవరానికి చెందిన ప్రవాసాంధ్రుడు, వేగేశ్న ఫౌండేషన్ చైర్మన్ అనంతకోటి రాజు

ఆయన చేతికి ఎముకలేదు అంటారు. ఎవరు సాయం అడిగినా కాదనరు. గణపవరం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు వేగేశ్న అనంతకోటిరాజు అమెరికా వెళ్లి అక్కడ వ్యాపారంలో స్థిరపడ్డారు. దేనికి లోటులేదు.. అయినా జన్మభూమిని మరచిపోలేదు. సొంత ఊరిలోనే కాకుండా పలు రాష్ట్రాల్లో ఆయన సేవ చేస్తున్నారు. తన సంపాదనతో సొంత గడ్డకు కొంతైనా మేలు చేయాలనే లక్ష్యంతో స్వగ్రామం అయిన గణపవరంలో జగన్నాథపురం కేంద్రంగా రాజు వేగేశ్న ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రారంభించారు. తన తండ్రి ఏసుదాతరాజు అన్న ఆనందరాజుల ఆధ్వర్యంలో సేవలు కొనసాగిస్తున్నారు. ఆనందరాజు హైదరాబాదు, విశాఖపట్నం కేంద్రాలుగా చేసుకుని సేవలు విస్తరిస్తున్నారు. తండ్రి ఏసుదాత రాజు గణపవరంతో పాటు జిల్లా ప్రజలకు మంచినీరు, విద్యా, ఆరోగ్యం, దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తున్నారు. గణపవరంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.18లక్షలతో మినరల్ వాటర్ ప్లాంటు నిర్మాణం చేశారు. అదనపు మంచినీటి చెరువుల ఏర్పాటుకు సుమారు 8 ఎకరాల భూములు కొనుగోలు చేశారు. రూ.60 లక్షల వ్యయంతో వేంకటేశ్వరస్వామి ఆలయం, కల్యాణ మండపాలు నిర్మించారు.గ్రామంలో రూ.23 లక్షలతో హిందూ శ్మశానవాటిక ఆధునీకరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, బాలుర హైస్కూల్ అభివృద్ధికి విరాళలు ఇచ్చారు. గణపవరంలో దీర్ఘకాలికంగా పేదలకు ఇళ్ళస్థలాల సమస్య ఉండటంతో స్పందించి స్థలం కొనుగోలుకు 30 ఎకరాలు సేకరించారు. దీని నిమిత్తం తనవంతుగా రూ.50 లక్షలు అప్పటి దివంగత ముఖ్యమంత్రి రాజ శేఖర్‌రెడ్డికి అందజేశారు. దీంతో ప్రభుత్వ వ్యయంతో 1200 మంది పేదలకు మోడల్ కాలనీ నిర్మాణానికి చేయుతనిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వెంగమాంబ నిత్యాన్నదాన భవన నిర్మాణం, భక్తులకు విశ్రాంతి భవనం, మంచినీటి సౌకర్యార్థం వాటర్ ప్లాంటులకు సుమారు రూ.40 కోట్లు వెచ్చించారు. శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, తదితర 50 ప్రధాన పుణ్య క్షేత్రాల్లో వాటర్‌ప్లాంట్లు నిర్మించి స్వచ్ఛమైన తాగునీరు భక్తులకు అందజేశారు. దేశవ్యాప్తంగా అనేక రైల్వేస్టేషన్లలో వేగేశ్న ఫౌండేషన్ ద్వారా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు.

- గణపవరం (ఆంధ్రజ్యోతి)



ప్రసిద్ధ ఆలయాల వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్లు



విద్యార్థినికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న డిఈవో నారాయణ

గణతంత్ర వేడుకలకు సరస్వతీ విద్యాలయ విద్యార్థిని

పెంటపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రత్తిపాడు గ్రామానికి చెందిన సరస్వతీ విద్యాలయ విద్యార్థిని జవ్వాది రాహిని ఈనెల 26 న డిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నట్టు మండల ఎంఈవో-2 టీవీ రామకృష్ణ తెలిపారు. ఆజాదీ కి అమృత్ మహోత్సవాల్లో భాగంగా కేంద్రప్రభుత్వం చేపట్టిన వీర్‌గాథ 4.0 కార్యక్రమంలో రాష్ట్రంలో విద్యార్థులందరికి దేశం కోసం త్యాగం చేసిన వీరుల పట్ల అవగాహన కల్గించడం కోసం ఆన్‌లైన్‌లో వ్యాసరచన, పెయింటింగ్, పద్యరచన పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీలకు జిల్లా నుంచి సుమారు 98 వేల ఎంట్రీలు నమోదు కాగా విద్యార్థి రాహిని నేషనల్ టాప్ హండ్రెడ్ ఎంట్రీస్‌లో ఒకటిగా నిలిచిందన్నారు. రూ..10 వేలు నగదు బహుమతి సాధించిందన్నారు. డీఈవో నారాయణ, , సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజక్టు కోఆర్డినేటర్ శ్యాం సుందర్ ఎంఈవో-1 శ్రీనివాస్, సరస్వతి విద్యాలయ ప్రిన్సిపాల్ కొలనువాడ వెంకట్ అభినందించారు.

రాయకుదురులో నేటి నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

వీరవాసరం(భీమవరంటౌన్)జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణదేవరాయ నాటక కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటక పోటీలు రాయకుదురులో జనవరి 10, 11,12 వ తేదీల్లో నిర్వహించ నున్నట్టు కళా పరిషత్ అధ్యక్షుడు గోపాల కృష్ణ కెఎస్ఆర్‌కె, కార్యదర్శి డాక్టర్ అడబాల లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. 10వ తేదీ రాత్రి మొదటి ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, రెండో ప్రదర్శనగా అనకాపల్లి వారి మలి సంధ్య, 11న పాలకొల్లు నటీనట సమాఖ్య వారి అనూహ్యం నాటిక ప్రదర్శిస్తారన్నారు.

తేనెలొలుకు...తెలుగు భాష



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు (ఇన్‌సెట్‌లో) మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులకు సత్కారం



» పులకించిన తెలుగు తల్లి » తరలివచ్చిన భాషాభిమానులు » అతిథులకు పురస్కారాలు...సత్కారాలు

» రాజమండ్రిలో ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలు

రాజానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష మాధుర్యం, వేర్వేరు ప్రాంతాల యాసలతో తెలుగు తల్లి పులకించింది. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. మాతృభాషను కీర్తిస్తూ పలువురు రాజకీయ ప్రముఖులు, కవులు, రచయితల ప్రసంగాలతో తెలుగు తల్లి ఉప్పొంగి పోయింది. తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ భాషాభిమానులంతా తన్మయత్వంలో మునిగితేలారు. జీజీయూ కులపతి కలిదిండి సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన రాజరాజ నరేంద్ర వేదికపై ప్రారంభమైన రెండో రోజు వేడుకలకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సభాధ్యక్షత వహించగా, ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులు శంఖారావం పూరించి సభలను ప్రారంభించారు. పలువురు రాజకీయ సాహితీ ప్రముఖులు, అవధానులు, కవులు, రచయితలు, కళాకారులు తెలుగు భాష ఔన్నత్యాన్ని వెలుగెత్తి చాటారు.

తెలుగు భాషను కాపాడుకోవాలి

కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ అమ్మభాషైన తెలుగుభాష మూలాలను పిల్లలకు వివరించడం ద్వారా తెలుగు భాషను కాపాడుకోవాలన్నారు. రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగుభాష పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

యూనిటీకి మించిన శక్తి లేదు..

మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ యూనిటీకి మించిన శక్తి లేదని, దీని మూలంగానే పాండవులు విజయం సాధించారన్నారు. తెలుగు భాషకు చావు లేదని, దానిలో మునిగి తేలితే చాలన్నారు. తెలుగు జాతి వారికి సంస్కారం ఎక్కువని, ఇది ఎవ్వరూ నేర్పేది కాదన్నారు. విదేశాల్లో సైతం తెలుగు సంస్కృతిని, సంప్రదాయాలను పాటిస్తున్నారన్నారు. ఒకరినొకరు గౌరవించుకోవడం తెలుగుజాతి సొంతమన్నారు.

అతిథులకు ఘన సత్కారాలు

సమావేశంలో చివరిగా అతిథులను ఘనంగా సత్కరించి, పురస్కారాలు అందజేశారు. దీనిలో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులను, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులను సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. అలాగే కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, చామర్తి రాజు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కవి గరిమెళ్ల వరప్రసాద్, వసుధా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లంక దినకర్, అందె శ్రీను, గోపిమూర్తిలను ఘనంగా సన్మానించి, పురస్కారాలు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

ప్రపంచ తెలుగు మహాసభలు ముగింపు వేడుకల్లో భాగంగా గురువారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన పలు శాస్త్రీయ, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి.



భీమడోలులో విజిలెన్స్ తనిఖీలు

ఏలూరు క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్స్ అధికారులు భీమడోలులో గురువారం ఆయిల్ షాపులను తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎస్ఐ కె సీతారామ్, ఆహార తనిఖీ అధికారి కె రామరాజు వారి సిబ్బంది కలిసి భీమడోలులోని ఆయిల్‌షాపులు అయిన మెస్సర్స్ జె శ్రీవేంకటేశ్వరస్వామి ట్రేడర్స్, మెస్సర్స్ శ్రీ రామచంద్ర ఎంటర్ ప్రైజెస్‌లలో తనిఖీలు నిర్వహించారు. వాటిలో కల్లూర్ లైన్ గ్రౌండ్ నట్ ఆయిల్, సూపర్ గ్రౌండ్ నట్ ఆయిల్ శాంపిల్స్‌ను నాణ్యత పరీక్షల కోసం సేకరించారు.

మండవల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ

మండవల్లి జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండవల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సుమారు 8 నెలలుగా మండవల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇన్‌చార్జి సభ్యు లతో నడుస్తోంది. ఎట్టకేలకు మండవల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రార్ ను నియమించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోడీలు కావలెను!

» జోడీల వేటలో పందేల నిర్వాహకులు » పెంచిన కోళ్లకు వైరస్ సోకడంతో కథ మొదలు

» ఈ ఏడాది నాలుగు చోట్ల భారీ బరులకు సన్నాహాలు » ఇప్పటికే నిండుకున్న లాడ్జీలు



పుంజులకు ఈతలో తర్ఫీదు

తాడేపల్లిగూడెం రూరల్/నరసాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వస్తోంది. కోడి పందేలకు పశ్చిమలో బరులకు సన్నాహాలు దాదాపు పూర్తయ్యాయి. ఇంక కావాల్సింది పుంజులు. వాటిని ముందుగానే సిద్ధం చేసుకున్న నిర్వాహకులకు వైరస్ వల్ల పుంజులు మృత్యువాత పడటంతో జోడీల కొరత నిర్వాహకులకు తలనొప్పిగా మారింది. దీంతో నిర్వాహకులంతా జోడీల కోసం జల్లెడ పడుతున్నారు. ఏ నిర్వాహకుడికి ఎన్ని జోడీలు ఎక్కువ దొరికితే ఆ బరి రసవత్తరంగా మారుతుందని పందెం రాయుళ్లు ఆ బరికి క్యూ కడతారని నిర్వాహకులు ఆశిస్తున్నారు. దీంతో ఎక్కువ జోడీలను సొంతం చేసుకునేందుకు లక్షలు వెచ్చించేందుకు సిద్ధమయ్యారు. ఆరు నెలల ముందు నుంచి పందాల నిర్వాహకులు పుంజులను ఎంపిక చేసుకుని ఆ పుంజుల పెంపకందారులకు ముందస్తుగా మేతకు సొమ్ములు ఇచ్చి బుక్ చేసుకునే ఆనవాయితీ మొదటి నుంచి ఉంది. అయితే ఈ ఏడాది ఎప్పటిలాగే పుంజుల పెంపకందారులకు మేతను నిర్వాహకులు భరించారు. అయితే పందాలు దగ్గర పడే సమయంలో పుంజులు వైరస్ బారినపడి మృత్యువాత పడటంతో నిర్వాహకులు ఆందోళనలో పడిపోయారు.

బరికి రోజుకు 50 నుంచి 100 జోడీలు

బరి వేయాలంటే ముందు పందెగాళ్లను ఆకట్టుకోవాలి. ఆ పందెగాళ్లను ఆకట్టుకునేందుకు సరిజోడీలను రంగంలోకి దింపాలి. దింపిన జోడీలపై పందెగాళ్లు వేసే పందేలపైనే పండగ సంబరం పెరుగుతుంది. బరివేయాలనుకునే నిర్వాహకులు ఏడాది ముందుగానే జోడీలను సిద్ధం చేసుకుంటారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల వచ్చిన మార్పులతో పెంచుకున్న జోడీలు కాస్త ఖాళీ కావడంతో వారిలో జోడీల గుబులు మొదలైంది. దీంతో రోజుకు 50 నుంచి 100 జోడీలు లెక్కలేసి పందెం పుంజుల పెంపకందారులకు లక్షల్లో అడ్వాన్సులు ఇచ్చి మరీ సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పందెం పుంజుల పెపకం దారులకు గిరాకి పెరిగింది.

తీరంలో కోడి పందేలకు సై...?

ఈ ఏడాది కోడిపందేలను భారీగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో చిన్న చిన్న బరులే ఉండేవి. దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే పందేంరాయుళ్ళ సంఖ్య తక్కువగానే ఉండేది. అయితే ఈసారి సీన్ మారుతోంది. నాలుగు చోట్ల భారీ బరులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నలుగురు నిర్వాహకులు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఒక బరి నిర్వాహకుడు మాత్రం పందేంరాయుళ్లను ఆకర్షించేందుకు దాదాపు రూ.50లక్షలు ఖర్చు పెట్టేందుకు సిద్ధం అవుతున్నట్టు సమాచారం. బయట ప్రాంతాల నుంచి దాదాపు పందెంరాయుళ్లను రప్పిం చడంతో పాటు పెద్ద ఎత్తున వినోద కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే పందెంరాయుళ్ళ కోసం ఇప్పటికే ఈ నిర్వాహకులు రూమ్‌లన్ని బుక్ చేసేశారు. మూడు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇందులో బరిలతోపాటు వేదికలు, కార్ పార్కింగ్‌కు కూడా ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నిర్వాహకుడి ఏర్పాట్లను తెలుసుకున్న మిగిలిన ముగ్గురు దీటైనా ఏర్పాట్లకే సిద్ధమవుతున్నారు. ఇందులో ఒక బరిని పాలకొల్లు రోడ్, మరో బరి లక్ష్మణేశ్వరం, మరొకటి మొగల్తూరులో ఏర్పాట్లు జరగు తున్నాయి. గతంలో గ్రామాల్లో చిన్న చిన్న బరులు ఉండేవి. ఈసారి పెద్ద బరులు వస్తుండటంతో చిన్న బరులకు పందేంరాయుళ్లు వస్తారా లేదా అన్న సందేహం నిర్వాహకుల్లో నెలకొంది.

కోడి పందేల బరులు ధ్వంసం

ఏలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ గ్రామంలో గురువారం కోడి పందేల కోసం ఏర్పాటు చేసిన బరులను తహసీల్దారు సాయిరాజు, ఎస్ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సరదాగా రూ. కోటి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కోడి పందేలకు జిల్లాలో నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అతిథులు విచ్చేస్తున్నారు. పెద్ద మొత్తంలో పందేలు కాసేందుకు ఉబలాటపడుతున్నారు. తాడేపల్లిగూడెంలోని ఓ తోటలో నిర్వహించే బరికి ఇప్పటినుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కోడి పందేల్లో పేరుమోసిన ఓ యజమాని తన కోళ్లతో తాడేపల్లిగూ డెం రావడానికి సన్నాహాలు చేసుకున్నారు. మూడు రోజులపాటు పాల్గొంటున్నారు. అతని పేరు రత్తయ్యగా ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎవరైనా సై అంటే మూడు రోజుల్లో ఒక పందాన్ని కోటి రూపాయల వరకు కాయనున్నట్టు ప్రకటించారు. ఎప్పటినుంచో తన మనస్సులో ఉన్న మాటను ఆయన బయట పెట్టారు. సొంత కోళ్లను పందేల కోసం పెంచుకుంటున్నారు. వాటితో తాడేపల్లిగూడెంలో పందేల కోసం రానున్నట్టు సోషల్ మీడియాలో ప్రకటించారు. అదే ఇ ప్పుడు పందెగాళ్లలో ఆసక్తి రేపుతోంది. మరోవైపు భీమవరం, ఉండి. గణపవరం, నర్సాపురం, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో భారీ బరలు వేసేందుకు కసరత్తు పూర్తయ్యింది.



మహిళా అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

1975 మంది అభ్యర్థుల అర్హత

ఏలూరు క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఖాళీగా ఉన్న 204 కానిస్టేబుళ్ళ పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు నోటిఫికేషన్ జారీ చేయడంతో గతంలోనే ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించారు. అందులో అర్హత సాధించిన 4976 మంది అభ్యర్థులకు హాల్‌టిక్కెట్లు జారీ చేశారు. వీరికి గతనెల 30వ తేదీ నుంచి ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, పోలీస్ అధికారులు కలిసి అభ్యర్థులకు దేహదారుడ్య పరీక్షలు, స్పోర్ట్స్ ఈవెంట్స్ గురువారం వరకు నిర్వహించారు. ఈ పరీక్షలకు 3453 మంది హాజరయ్యారు. వీరిలో 1975 మంది అర్హత సాధించారు. ఫైనల్ రాత పరీక్షను రిక్రూట్‌మెంట్‌బోర్డు ప్రకటించనుంది.

వచ్చే ఏడాదికి ఆక్వా యూనివర్శిటీ పనులు పూర్తి



ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులతో డీన్ డాక్టర్ సుగుణ

నరసాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సరిపల్లి గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఆక్వా యూనివర్శిటీని వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామని యూనివర్శిటీ డీన్ డాక్టర్ టి.సుగణ అన్నారు. గురువారం సాయంత్రం లక్ష్మణేశ్వరం గ్రామంలోని తాత్కాలిక యూనివర్శిటీ భవనంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఆక్వా రంగంలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్న అవకాశా లను అంది పుచ్చుకోవాల న్నారు. డిగ్రీతో సరిపెట్టకుండా ఇదే కాలేజీలో పీజీ చేయా లన్న లక్ష్యంతో చదవాలన్నారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.ధనపాల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆక్వా సాగు విస్తరణ పెరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ రంగానికి ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తున్నాయమన్నారు. వీటితో పాటు ఆక్వా విద్యకు సంబంధించిన కాలే జీల సంఖ్య, కోర్సులను కూడా పెంచుతుం దన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల అసోసియేటెడ్ డీన్ డాక్టర్ కె.నీరజ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

బాలికపై అత్యాచారం

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాతూరుకు చెందిన రూపం పండు అదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలికపై కన్నేశాడు. ఆ బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెను బెదిరించి పలు మార్లు అత్యాచారం చేశాడు. ఆ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించడంతో ఆమె భయపడి ఎవరికి చెప్పలేదు. బాలిక అనారోగ్యంగా ఉండటాన్ని గమనించిన తల్లి దండ్రులు ఆరాతీస్తే విషయం బయట పడింది. దీంతో బాలిక ఫిర్యాదు మేరకు రూపం పండుపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

పెంటపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : మీనవల్లూరు గ్రామానికి చెందిన చుండ్రు నరసింహమూర్తి(69) కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. వ్యాధికి సంబ ంధించి చికిత్స కూడా చేయించుకుంటున్నాడు. ఇటీవల వ్యాధి బాగా ముదిరి పోవడంతో తాళలేక బుధవారం పొలం వెళ్తున్నానని ఇం ట్లో చెప్పి పొలం వద్ద ఉన్న గేదెల పాకలో పురుగుల మందు తాగేశాడు. మధ్యాహ్నం అయినా భోజనానికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్ళి చూడగా అస్వస్థతతో పడి ఉన్నాడు. తణుకులోని ఒక ప్రైవేటు ఆసుప త్రికి తరలించగా గురువారం మృతి చెం దాడు. మృతుని భార్య బేబి సరోజిని ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

ఆటోలో నగదు చోరీ

భీమవరం క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తన కుమార్తె ఇంటికి వెళ్లడం కోసం ఆటోలో బయలుదేరిన ఒక మహిళ బ్యాగులో రూ. 1.50 లక్షల నగదు చోరీకి గురైంది. భీమవరం టూటౌన్ హెచ్‌సీ భూషణం తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన వేగిరాజు రామలక్ష్మి ఈ నెల 6వ తేదీన తన కుమార్తె ఇంటికి వెళ్ళడం కోసం బ్యాగులో రూ.1.50 లక్షల నగదు పెట్టుకుని బయలుదేరింది. భీమవరం ప్రకాశం చౌక్‌లో బస్సు దిగి ఆటో ఎక్కి అడ్డవంతెన దగ్గర దిగి కుమార్తె ఇంటికి వెళ్ళింది. అక్కడ బ్యాగ్ తెరచి చూసేసరికి రూ. 1.50 లక్షల నగదు కనిపించలేదు. దీంతో భీమవరం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ భూషణం తెలిపారు.



నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ శావణ్‌కుమార్

ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

మూడు లక్షల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

భీమడోలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు, చేబ్రోలు, నర్సాపురం తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను భీమడోలు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా గూడూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన రంగనాథం కిరణ్, ఎల్లుట్ల నారాణయమ్మ, ఎల్లుట్ల వసంతకుమార్‌లు అంతర్ జిల్లా దొంగలు. ఈ ముగ్గురిపై 58 పాత కేసులు ఉన్నాయి. ఇటీవల భీమడోలులో జరిగిన దొంగతనంపై కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా నిందితులు భీమడోలులో తిరుగాడుతున్నట్లుగా వచ్చిన సమాచారంతో భీమడోలు సీఐ విల్సన్ ఆధ్వర్యంలో ఎస్ఐ సుధాకర్, సిబ్బంది ఈ ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఐదు కేసులకు సంబంధించి దొంగతనాల్లో కాజేసిన సుమారు మూడు లక్షల రూపాయల వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకున్నారు. ప్రథమ ముద్దాయి రంగనాథం కిరణ్‌పై43, వసంత కుమార్‌పై7, నారాయణమ్మపై 8 కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.



గొరగనమూడి హైస్కూల్ వద్ద ధర్నా చేస్తున్న దళిత యువకులు

విగ్రహాల ఏర్పాటు.. వివాదాస్పదం

పాలకోడేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గొరగనమూడి హైస్కూల్ ప్రాంగణంలో విగ్రహాల ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. గొరగనమూడి హైస్కూల్ ప్రాంగణంలో కొన్ని రోజుల క్రితం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ విగ్రహానికి ముందుగా స్వామి జ్ఞానానంద విగ్రహాన్ని, మూర్తిరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఏర్పాట్లు చేపట్టారు. దీంతో ఆగ్రహించిన గ్రామానికి చెందిన దళితులు ఇదెక్కడి అన్యాయం.. అంబేడ్కర్ విగ్రహాన్ని కనిపించకుండా చేస్తారా అంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమన్యాయం పాటించాలంటూ ధర్నా చేపట్టారు. దీంతో ఈ విషయం సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు దృష్టికి వెళ్ళడంతో ఆయన వివాదం సద్దుమణిగే విధంగా చర్చలు జరిపారు. అన్ని విగ్రహాలు ఒకే లైన్‌లో వచ్చేలా చర్యలు చేపట్టడంతో వివాదం సద్దుమణిగింది.

వేద పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య



కైకలూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని వేద విద్యలో ఉన్నత స్థానంలోకి తీసుకువెళ్లాలని వేద పాఠశాలలో చేర్పిస్తే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కంట తడి పెట్టించింది. కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామంలోని శివాలయంలో అర్చకుడైన కందుర్తి శివశ్రీ, ఛాయదేవి దంపతుల కుమారుడు సాయిశివ సూరజ్ (19) బుధవారం రాత్రి వేదపాఠశాలలో ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగేళ్ళుగా గుంటూరుజిల్లా కోటప్పకొండలో తిరుమల తిరుపతి దేవ స్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేదవిజ్ఞాన పీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్నాడు. వేదపాఠశాల లోని కొంతమంది వేధింపులు తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా స్థానికులు పేర్కొంటున్నారు. కుమా రుడి మరణవార్త విని గురువారం ఉదయం భుజబలపట్నంలో తల్లిదండ్రులు బోరున విలపించారు. అనంతరం బంధు మిత్రుల సహాయంతో కోటప్పకొండ వెళ్లి పోలీసులకు కుమారుడి మృతిపై ఫిర్యాదు చేశారు. అర్చ కుడు శివశ్రీ స్వగ్రామం కృష్ణాజిల్లా బంటు మిల్లి మండలం పెద్ద తుమ్మిడి గ్రామం. కుమారుడి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తీసుకు వెళ్లారు. భుజబలపట్నం గ్రామం నుంచి పలువురు పెద్దఎత్తున తరలివెళ్లి సంతాపం తెలియజేశారు.

మహిళ అనుమానాస్పద మృతి

భీమవరం క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒక మహిళ తాను ఉంటున్న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ ఏఎస్ఐ మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ప్రకాష్ నగర్‌కు చెందిన యాళ్ళ కృష్ణ కుమార్తె హరితపు రవీంద్రకుమారి (30) భర్త కుమార్‌ను వదిలి రాయలం గ్రామంలో ఒంటరిగా ఉంటుంది. గురువారం తెల్లవారుజామున తాను ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై ఆధారాలు సేకరిస్తున్నట్లు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మావుళ్ళమ్మ ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

భీమవరంటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ కార్యవర్గం కలిసి మావుళ్ళమ్మ 61వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రాన్ని అందించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా భీమవరం పట్టణంలో నెల రోజులు పాటు మావుళ్ళమ్మ మహోత్సవాలు ఈనెల 13 నుంచి ఫిబ్రవరి 14 వరకు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. ఉత్సవ కమిటీ కార్యవర్గం అధ్యక్షుడు రామాయణం గోవిందరావు, ఉపాధ్యక్షుడు కొప్పుల సత్యనారాయణ, కార్యదర్శులు కొప్పుల రంగారావు, రామాయణం సత్యనారాయణ, నరహరి శెట్టి సూర్యనారాయణ, రామాయణం శ్రీనివాస రావు, ఆకుల సోమేశ్వరరావు, కొప్పుల రాంబాబు, మానే భాస్కరరావు, మానే తేజ సురేష్, కోశాధికారి రామాయణం సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

సూర్య ఘర్ పథకంపై విస్తృత ప్రచారం చేయాలి : జేసీ

భీమవరంటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై ప్రజలలో విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత శాఖల అధికారులను జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వెండర్స్, అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు, రెసిడెన్షియల్ కాలనీ అసోసియేషన్ సభ్యులకు, సూర్యఘర్ పథకం అమలుపై అవగాహన సమావేశం నిర్వహించారు. రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని సూచించారు. పథకం ఆవశ్యకతను రాయితీలపై సభ్యులకు వివరించారు. సదస్సులో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ రఘునాథబాబు, ఈఈలు వెంకటేశ్వరరావు, నరసింహమూర్తి, మధుకుమార్, ఏడీఏఈలు, ఏఈలు, ప్యానల్ సప్లయర్స్ అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రూ.2 లక్షల విలువైన వాటర్ ప్లాంట్ బహూకరిస్తున్న దాత జూపల్లి వీరభద్రరావు

అర్ధవరం హైస్కూల్‌కు వాటర్ ప్లాంట్ బహూకరణ

గణపవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అందిస్తున్న సౌకర్యాలతో పాటు దాతలు చేయుతనివ్వడం స్ఫూర్తిదాయకమని ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు అన్నారు. గణపవరం మండలం వెలగపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ జూపల్లి అనీల్ సహకారంతో రూ.2లక్షలతో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను ఆయన తండ్రి వీరభద్రరావు గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు అందజేస్తుందని అదే తరహాలో ఎమ్మెల్యేలు ముందుకు వచ్చి మరింత సహకరించడం ఉదాహమని వాసురాజు అన్నారు. బీజేపీ నాయకుడు కంతేటి కృష్ణంరాజు, హెచ్ఎం ప్రసన్న ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూగ జీవాలను హింసించడం చట్టరీత్యా నేరం

భీమవరంటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సరదాల కోసం కోడి పందేలు, మూగ జంతువులను హింసించడం చట్ట రీత్యా నేరమని పశు సంవర్థక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జవర్ హుస్సేన్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పీఎస్ఎం గరల్స్ హైస్కూల్ విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జంతువులను ప్రేమించి ఆదరించడం మన భారతీయ సంస్కృతి అని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కోడి పందేలు, మూగ జంతువులను హింసించడం నేరమంటూ విద్యార్థులతో ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించామని అన్నారు. ఇన్‌ఛార్జి హెడ్ మాస్టర్ మాధవి లత, జ్ఞాన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

15 లోగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

పెనుగొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రైతులందరూ ఈనెల 15లోగా పంటల బీమా పథకం ప్రీమియం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం వడలి గ్రామంలో వరి పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులందరూ దమ్ములో వంద కేజీల సింగిల్ సూపర్ పాస్పేట్, 30 కేజీల యూరియా కలిసి వేయడం వల్ల గత పంటలోని మోడులు కుళ్ళి భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏవో పి.స్పందన, వ్యవసాయ సహాయకులు వై.వర్మ, రైతులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల తయారీలో నాణ్యత పాటించాలి : కమిషనర్

భీమవరంటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆహార పదార్థాలు, తినుబండారాలు తయారీలో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత పాటించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పలు హోటల్స్, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తనిఖీ చేశామని, కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకపోవటం, తినుబండారాల్లో కొన్ని నిషేధిత రసాయన రంగులను ఉపయోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇకపై పట్టణంలోని టిఫిన్, భోజన హోటళ్ళు, రెస్టారెంట్లు, తదితర షాపుల్లో ఆహార నాణ్యత ఉండాలని, లేదంటే వ్యాపారం మూసివేస్తామని హెచ్చరించారు. మునిసిపల్ నిబంధనల ప్రకారం భారీ జరిమానా విధించడంతో పాటు లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేసి వ్యాపారాన్ని మూసివేయిస్తామన్నారు.

ఆకివీడు పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలి : కమిషనర్

ఆకివీడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. గురువారం స్థానిక పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో చెత్త సేకరణ, తాగు నీరు సరఫరా పరిస్థితిని ఆయన పరిశీలించి మాట్లాడారు. రహదారులపై చెత్త పారేయవద్దని, ఇళ్ల వద్ద చెత్తను ఆయా చెత్త ట్రాక్టర్లు, రిక్షాలు వచ్చినప్పుడు వాటిలో వేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకెత్, మేస్త్రీలు ఉన్నారు.

ఆంజనేయు స్వామికి ఒంటె వాహనం అందజేత



ఆచంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కొడమంచిలి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయుడికి దాత సహకారంతో టేకుతో తయారు చేసిన ఒంటె వాహనాన్ని బహూకరించారు ఈ సందర్భంగా గురువారం ఆలయం వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమాలు నిర్వహించి ఒంటె వాహనాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మిక గురువు మానేపల్లి ఉమారామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ

పెంటపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని ప్రత్తిపాడు 3ఎఫ్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఓపీ గోయింకా అన్నారు. 3ఎఫ్ ఇండస్ట్రీస్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వంద మంది మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఓపి గోయింకా మాట్లాడుతూ 3ఎఫ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ప్రణవ్‌గోయింకా, జీఎంజనార్దన్, జి.శ్రీనివాస రెడ్డి, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముస్తాబైన శ్రీవారి క్షేత్రం

3వ పేజీ తరువాయి

యంత్రాంగాన్ని పెంచామని ఆలయ ఈఈ భాస్కర్ తెలిపారు. డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సెక్యూరిటీ విభాగం పనిచేస్తుందని వివరించారు. క్యూలైన్ల పొడవు పెంచామన్నారు. వాటిని పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 40 నుంచి 50 వేలకు పైబడి భక్తులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు. వారికి అన్ని తగిన సౌకర్యాలు కలిగేలా ఏర్పాట్లు చేసామన్నారు. క్యూలైన్లలో మంచినీరు, పాలు, మజ్జిగ అల్పాహారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 12 తాత్కాలిక టాయిలెట్లను నిర్మించామన్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు శీఘ్రంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆలయంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్, ఇతర పోలీసు అధికారులు పరిశీలించి ఈఈ భాస్కర్‌తో చర్చించారు. పోలీస్ యంత్రాంగాన్ని పెంచుతున్నామని పకడ్బందీగా ఉత్తర ద్వారదర్శనం భక్తులందరూ వీక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

కిక్.. దిగిపోయింది

3వ పేజీ తరువాయి

ఉన్నారు. వీరిని విచారిస్తే విస్తుపోయే వాస్తవాలు వెల్లడయ్యాయి. జానీవాకర్‌లో ఉన్న రెడ్, బ్లాక్, గోల్డ్ లేబుల్ మద్యం బాటిళ్ల పేరిట నకిలీ మద్యాన్ని దిగుమతి చేసుకుంటున్నట్టు తేలింది. ఇతర రాష్ట్రాల నుంచి వీటిని ప్రైవేటు ట్రావెల్ బస్సుల్లో తెప్పిస్తున్నట్టు చెప్పారు. హానికర రసాయనాలు మిశ్రమం చేసి బ్రాండెడ్ రకాల పేరుతో విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఈ మద్యం శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం లాబ్‌కు పంపినట్టు రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. లైసెన్స్ ఉన్న బార్లు, షాపుల్లోనే మద్యం కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. ఈ ముఠా వెనుక మరికొందరు ఉన్నారని, వారిని అరెస్ట్ చేస్తామని చెబుతున్నారు.



భీమవరం ఖజానా కార్యాలయం నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో కలెక్టర్ నాగరాణి



తణుకు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న వావిలాల సరళాదేవి, తదితరులు



పాలకొల్లులో ముగ్గుల పోటీలో విజేతలతో ధర్మారావు ఫౌండేషన్ సభ్యులు

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

- కలెక్టర్ చదలవాడ నాగరాణి
- ఆకట్టుకున్న ట్రెజరీ ఆఫీసులో సంక్రాంతి బొమ్మల కొలువు

భీమవరంటౌన్/భీమవరం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్ జిల్లా ఖజానా కార్యాలయంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును ఆమె జ్యోతిని వెలిగించి ప్రారంభించి, ఖజానా కార్యాలయ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి సంబరాలు సంప్రదాయం ఉట్టిపడేలా వేడుకగా జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని ప్రశంసించారు. ముగ్గులు, క్రీడలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కేఆర్ ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డీపీ ఆర్వో టి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో డీపీఆర్వో టి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది మధ్య కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- భీమవరంలో బీవీ రాజు కళాశాలలో విష్ణు విద్యా సంస్థల ఛైర్మన్ కేవీ విష్ణురాజు ఆధ్వర్యంలో, కేజీఆర్ఎల్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. సర్ సీవీ రామన్ స్కూల్లో సంక్రాంతి సంబరాలను ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్ఎస్ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు.
- తణుకు : సంస్కృతి, సంప్రదాయాలను అందరూ గౌరవించాలని లయన్స్ ఇంటర్నేషనల్ సేవా కో-ఆర్డినేటర్ వావిలాల సరళాదేవి, వెంకటరమేష్ అన్నారు. గురువారం తణుకులోని ఓ ప్రైవేట్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని లయన్స్ ప్రతినిధులు హాజరయ్యారు. తణుకు ఎస్‌కే ఎస్‌డీ మహిళా కళాశాలలో కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.
- నరసాపురం టౌన్/మొగల్తూరు : పట్టణంలోని బీజీబీఎస్ మహిళా కళాశాల, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, ప్రారంభించారు. విజేతలకు బహుమతులందించారు. మొగల్తూరు పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, పాఠశాల వ్యవస్థాపకులు ఆకన ఫణీంద్రనాథ్, ప్రిన్సిపాల్ సుష్మ పాల్గొన్నారు.
- యలమంచిలి/పాలకొల్లు అర్బన్/ పాలకొల్లు : ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యలమంచిలి హైస్కూల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మండలస్థాయి ముగ్గుల పోటీలకు తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజార మణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుమారు 70 మంది మహిళలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. పోటీల్లో 11 మందిని విజేతలుగా ఎంపికచేశారు. పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎస్‌వీ మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాలకొల్లులోని 12వ వార్డు సుబ్బారాయుడు గుడివద్ద వీహెచ్‌పీ జిల్లా నాయకురాలు తొట్టెంపూడి సునీత ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్ట్, హ్యాండీ క్రాఫ్ట్ పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు.
- పెనుగొండ/పెనుమంట్ర/పోడూరు: పెనుగొండ భాష్యం పాఠశాలలో ప్రిన్సిపాల్ వెంకట అప్పా రావు ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహిం చారు. భాష్యం విద్యా సంస్థల వెస్ట్ జోన్ ఇన్‌చార్జి ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, చాంప్స్ ఇన్‌చార్జి రాణీ రోజాజి పాల్గొన్నారు. పెనుమంట్ర మండలం పొలమూరు పాఠశాలలో హెచ్ఎం బీడీ సరస్వతి, సెకండ్ హెచ్ఎం సంకు తాతయ్య ఆధ్వర్యంలో, పోడూరు మండలం వేడంగి జడ్పీ హైస్కూల్‌లో గ్రామానికి చెందిన దివంగత దుప్పనపూడి కామాక్షమ్మ జ్ఞాపకార్థం మను మడు కాశీరామ్ వినీల దంపతులు విరాళంతో ముగ్గుల పోటీలు నిర్వహించారు.
- ఆకివీడు/కాళ్ల : ఆకివీడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తోట పోతురాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కాళ్ల మండలం సీసలిలో వున్న షిరిడీ సాయిబాబా ఆలయంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలకు ఆకివీడు పవన్ సాయి శ్రీనివాస ఏ

సిబ్బంది నుంచి రూ.36 వేల రికవరీకి ఆదేశం

పెనుమంట్ర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మస్టర్‌లో లోపాలు, పనికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వంటి అంశాలను తనిఖీ బృందాలు గుర్తించి ఫీల్డ్ అసిస్టెంట్, సిబ్బంది నుంచి రూ.36,968 రికవరీ చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కేసీహెచ్ అప్పారావు ఆదేశించారు. గురువారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023-24 సంబంధించి 1,337 పనులకు గాను అన్ని గ్రామాల్లో ఇప్పటివరకు తనిఖీ నిర్వహించగా వాటిలో 10లక్షల 35వేల రూపాయల విలువైన పనులకు సంబంధించి రికార్డుల్లో లోపాలను గుర్తించారు. వాటిని సరిచేసి జిల్లా విజిలెన్స్ అధికారికి సమర్పించాలని ఆదేశించారు. ఎంపీడీవో టీవీఎస్ శర్మ, సామాజిక తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

వీరపేరంటాలమ్మ హుండీల సొమ్ము ఆదాయం రూ. 5.74 లక్షలు

ఉండి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వెలివర్రు వీర పేరంటాలమ్మ ఆలయంలో ఆరు నెలల పదిరోజులకు భక్తులు హుండీల్లో సమర్పించిన నగదు లెక్కించగా రు.5లక్షల74వేల422 వచ్చాయని ఆలయ ఈవో ఎస్ఎస్ రంగరాజు తెలిపారు. గురువారం వెలివర్రు అమ్మవారి ఆలయంలో హుండీల లెక్కింపు జరిపారు. మత్స్యపురి ఈవో ఎం.రఘునాథ్ కలిగొట్ల ఈవో ఎంప. రామరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ ముదునూరి రంగరాజు, ఉపసర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల

తణుకు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సజ్జాపురం, తణుకు విద్యుత్ సబ్ స్టేషన్లు లైన్లు మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డివిజనల్ ఇంజనీర్ కె.నరశింహమూర్తి తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పట్టణంలోని రామకృష్ణ మఠం ప్రాంతం, సజ్జాపురం, రైల్వేస్టేషన్ ప్రాంతాలు, భాష్యం స్కూల్ నుంచి గ్రాండ్ గోస్తనీ ప్రాంతం వరకు ఉండదన్నారు.

'పశు వధ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోలేకపోతున్నారు'



తణుకు రూరల్, జనవరి 9, (ఆంధ్రజ్యోతి) : తేతలి గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వధ ఫ్యాక్టరీపై స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోలేకపోతున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. గురువారం తణుకు వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశు వధ ఫ్యాక్టరీకి అన్ని అనుమతులు తన హయాంలోనే వచ్చాయని చెబుతున్నారని అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం మూడు ఎకరాలు 29 సెంట్ల నుంచి 34 ఎకరాలకు ఉన్నట్లు అనుమతులు ఎవరు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోలోని బస్సు సర్వీసులు, కార్గో సేవలు తదితర అంశాలపై ప్రయాణికుల సూచనలు, సలహాల కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 99592 25488 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత పండు లెవన్స్



విజేతలకు బహుమతులు అందజేత

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం ఏపీ నిట్ సమీపంలో పదిహేను రోజులుగా హోరాహోరీగా సాగిన గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పండు లెవన్స్ నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆర్‌డబ్ల్యూ లెవెన్స్‌పై పండు లెవన్స్ జట్టు విజయం సాధించి ట్రోఫీ కైవశం చేసుకోవడంతో రూ. 25 వేల నగదు బహుమతి సాధించింది. రన్నర్‌గా నిలిచిన ఆర్‌డబ్ల్యూ లెవన్ జట్టు రూ.15వేల నగదు, రన్నరప్ ట్రోఫీ అందుకుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతి అందించారు. విజేతలకు బహుమతులను బీజేపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజి, జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, ఫౌండేషన్ ఛైర్మన్ గొర్రెల శ్రీధర్ తదితరులు బహుమతులు అందించారు.

'దాళ్వా సాగులో నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి'

పోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : దాళ్వా సాగులో నీటి ఎద్దడి రాకుండా ఇరిగేషన్ శాఖ పక్కా ప్రణాళికగా చర్యలు తీసుకోవాలని, రైతులు కూడా సహకరించాలని పాలకొల్లు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు కోరారు. పెనుమదం ఉమాఅగస్త్యేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో గురువారం దాళ్వా సాగు నీటి సరఫరాపై ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెనుమదం అల్లిపర్రులో సుమారు నాలుగు వందల ఎకరాలకు సాగునీరు అందించే దిశగా మురుగు కాల్వలకు అడ్డుకట్ట వేసి సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. అనంతరం పాలకొల్లు ఇరిగేషన్ శాఖ డీఈ వెంకటనారాయణ మాట్లాడారు. సర్పంచ్ బాబూరావు, దేవరపు దొరబాబు, రైతులు పాల్గొన్నారు.

ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ నూతన అధ్యక్షుడిగా సూరిబాబు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ నూతన అధ్యక్షుడిగా తిరుమళ్ల సూరిబాబు గురువారం తాడేపల్లిగూడెంలోని వాకర్స్ భవనం వద్ద ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ కార్యదర్శిగా అల్లూరి శ్రీనివాస్, కోశాధికారిగా మల్లారెడ్డి సారధి, సభ్యులు ప్రమాణం చేశారు. సంఘ జిల్లా నాయకులు కూచిపూడి వెంకటకృష్ణారావు, రాజేంద్ర, కప్పల నరసింహమూర్తి, జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ తదితరులు కార్యవర్గాన్ని అభినందించారు.

తిరుమలలో తొక్కిసలాట పాపం ప్రభుత్వానిదే : కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి తొక్కిసలాటలో తొమ్మిది మంది మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసం వద్ద గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముక్కోటికి ఉత్తర ద్వార దర్శనం కోసం ఎంతోమంది భక్తులు వేచి ఉంటారని తెలిసినా టికెట్ కౌంటర్‌ల వద్దకు భక్తులను వదిలేయడం దారుణమన్నారు. దీనికి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారులపై నెట్టేయడం తగదన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

పెంటపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని టీడీపీ తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్ అన్నారు. గురువారం కె.పెంటపాడు గ్రామంలో సర్పంచ్ పీతల సత్యనారాయణ అధ్యక్షతన గృహ నిర్మాణాల కోసం లబ్దిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పంతం శేఖర్, నరాలశెట్టి సంతోష్‌కుమార్, ఉపసర్పంచ్ పంతం శివరామకృష్ణ, చోడగిరి వెంకటేశులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరికలు

మొగల్తూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ముత్యాలపల్లి, దారతిప్ప గ్రామాల్లో వైసీపీ నుంచి జనసేన పార్టీలో 50 మంది కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్ సమక్షంలో చేరారు. దారతిప్ప గ్రామంలో ప్రముఖ ఆక్వా రైతు సరిపల్లి సుబ్బరాజు నాయకత్వంలో 45 మంది, ముత్యాలపల్లిలో చెన్నూరి శివాజీ నాయకత్వంలో ఐదుగురు జనసేన పార్టీలో చేరారు.

ఎరువుల గోదాముల్లో ఏవో తనిఖీ

అత్తిలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండలంలోని వరిఘేడు, తిరుపతిపురం గ్రామాల్లో సహకార సంఘం ఎరువుల గోదాములను ఏవో టీకే రాజేష్ తనిఖీ చేశారు. మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ఎరువుల డీలర్లందరూ ఎరువుల అమ్మకాలు ఎప్పటికప్పుడు ఈ-పోస్ యంత్రం ద్వారా వివరాలు నమోదు చేయాలని కోరారు.

ఇంటర్వ్యూ..

రూ.40 లక్షలతో తాగునీటి అభివృద్ధి పనులు



చీకట్ల బాలాజీ వెంకటరమణ
ఎంపీడీవో, పెంటపాడు

- **ఈ ఏడాది మండలంలో తాగునీటి అభివృద్ధికి మీరు తీసుకున్న చర్యలేవి ?**

జవాబు : ఇప్పటివరకు తాగునీటి అభివృద్ధి కోసం రూ.40 లక్షలు ఖర్చు చేశాం. వీటితో గ్రామాల్లో ఫిల్టర్ బెడ్స్, పైపులైన్లు తదితర పనులు చేపట్టాం.

- **పారిశుధ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేవి :**

జవాబు : ప్లాస్టిక్ వినియోగం ఎక్కువైంది. ప్లాస్టిక్ నిర్మూలన కోసం పంచాయితీలలో తీర్మానాలు సిద్ధం చేసి పండుగ తరువాత ప్రత్యేక కార్యాచరణ చేపడతాం.

- **గత ఆరు నెలల కాలంలో గ్రామాల్లో డ్రైనేజీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేవి ?**

జవాబు : గ్రామాల్లో డ్రైనేజీ అభివృద్ధి పనులు చేపట్టాం. ఎన్ఆర్ఈజీఎస్, మండలం, పంచాయతీ నిధులు వెచ్చిస్తున్నాం

- **మండలంలో కార్యదర్శుల కొరత ఏమైనా ఉందా ?**

జవాబు : మండలంలో బి.కొండేపాడు, కె.పెంటపాడు గ్రామాల్లో కార్యదర్శుల కొరత ఉంది. ఇన్‌చార్జి కార్యదర్శులను వేసి ప్రస్తుతం పనులు ముందుకు తీసుకువెళ్తున్నాం

(ఆంధ్రజ్యోతి- పెంటపాడు)

శ్రీవారిని దర్శించుకున్న జేసీ దంపతులు

భీమవరంటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి వేంకటేశ్వర స్వామిని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. మందిర అధ్యక్షుడు కె.వెంకటరాజు, కె.బాల, చెరుకువాడ రంగసాయి, జానపాటి మధు, సరిపిడకల రామారావు, శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.



దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న ధృవనిశ్చయవర్మ

వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

ఉండి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాశ్రమంలో ధృవ నిశ్చయవర్మ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మహదేవపట్నంలోని సన్‌రైజ్ వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ముదునూరి శివరామరాజు తన మనుమడు ధృవ నిశ్చయవర్మ నాలుగో పుట్టినరోజును వృద్ధుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు, టవళ్లు, పండ్లు పంపిణీ చేసి భోజనాలు అందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్తిబ్రహ్మారెడ్డి, ముదునూరి మోహనకృష్ణ రేవతి దంపతులు, గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు, పాలతీర్థపు నరసింహరావు పాల్గొన్నారు